వక్ఫ్ భూముల పేరిట రిజిస్ట్రేషన్ల నిలిపివేత తగదు


అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న ఆకుల సతీశ్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలోని సర్వే నంబర్ 58 నుంచి 226 వరకు వక్ఫ్ బోర్డు భూములంటూ (41 గుంటలు) రిజిస్ట్రేషన్ అధికారులు ప్రైవేట్ భూములు, భవనాలను నిషేధిత జాబితాలో పెట్టడం ఎంతవరకు సమంజసమని బీజేపీ నేత ఆకుల సతీశ్ పేర్కొన్నారు. ప్రైవేట్ భూములపై వక్ఫ్ బోర్డు పెత్తనం ఏంటని, తక్షణమే తిరిగి రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ చింతల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్‌లోని సర్వే నంబర్‌లోని 58–226 వరకు ప్రైవేట్ భూములు, బిల్డింగులను నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని, లేకుంటే ఆదివారం ఉదయం 8 గంటలకు పద్మానగర్ రింగ్ రోడ్డు నుంచి పాదయాత్ర చేపడుతానని, స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన


సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన ఉందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసానికి తరలివచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని కోరారు.అలాగే సూరారం శ్రీ నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంద్రసేనాగుప్తా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించే స్వామివారి మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. కమిటీ సభ్యులు శ్రీరాములు, యాదగిరి, నరసింహారెడ్డి, సురేశ్ ఉన్నారు.

అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలి


డీటీ ప్రభుదాస్‌కు ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్ తదితరులు

నిజాంపేట్: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ప్రజాయోగార్థం కేటాయించాలని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. నిజాంపేట్ సర్వే నంబర్ 109లోని 7.36 ఎకరాల ప్రభుత్వ భూమిలో వెలుస్తున్న ఆక్రమణలపై సీపీఐ ఆధ్వర్యంలో బాచుపల్లి మండల తహసీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే ఆక్రమణలపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా కూల్చివేతలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని, కబ్జాదారులను గుర్తించి వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలన్నారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. నాయకులు యాదయ్య, ఢిల్లీశ్వరరావు తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌పై దాడికి నిరసనగా ఆందోళన



సాక్షి,సిటీబ్యూరో: వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ.. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళనలు నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు భద్రత కల్పించాలని వారు కోరారు. ఇటువంటి ఘటన వల్ల అభద్రతాభావన కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడికి పాల్పడిన వారిపై ప్రభు త్వం కఠిన చర్యలు తీసుకోని పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో టీజీఏ జిల్లా నేతలు, వివిధ శాఖల అ ధికారులు విజయకుమారి, సైదులు, వినోద్ కుమా ర్, రాంమోహన్, కురుమూర్తి శ్రీనివాస్‌మూర్తి, రా జేశ్వర్‌రెడ్డి వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం

వికారాబాద్ జిల్లాలోని దుద్యాల మండలం లగిచర్ల గ్రామంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడిని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీఓ) జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి కురుమూర్తి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల్లో పని చేసే అధికారులు, ఉద్యోగులు వికారాబాద్ కలెక్టర్‌పై దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. టీజీఏ పిలుపు మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్ తెలిపారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు టీజీఏ జిల్లా నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వినోద్ కుమార్, కురుమూర్తి, వెంకటేశం, కర్ణాకర్‌రెడ్డితో సహా జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- చింతల్ చెరువులోకి చేప పిల్లల విడుదల


చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ చింతల చెరువు వద్ద మంగళవారం నిర్వహించిన చేప పిల్లల విడుదల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చెరువుల్లో మురుగునీరు కలవకుండా ఎస్టీపీలను నిర్మించామని తద్వారా మంచి చేపలు లభించడంతో పాటు పరిసరాలు మురుగుమయం కాకుండా ఆహ్లాదభరిత వాతావరణం ఏర్పడిందన్నారు. అనంతరం చెరువు వద్ద ఉన్న కోట గుట్ట పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేష గిరి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో –ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డైరెక్టర్లు కే రాము, సత్యావతి, లక్ష్మణ్, జిల్లా మత్స్యశాఖ అధికారి కీర్తి, గాజులరామారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు యాదగిరి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దుర్గయ్య, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకుడు అడ్వకేట్ కమలాకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ చెక్కులు అందజేత..


ఎల్‌ఓసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆశ్రయించారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన సీఎం సహాయనిధి నుంచి రూ. 4.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కులను పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఇందులో కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్ –2 కి చెందిన నర్సింగ్ రావుకు రూ. లక్ష, చింతల్ డివిజన్ చంద్రనగర్‌కు చెందిన సీహెచ్. లక్ష్మికి రూ. 1.50 లక్షలు, సూరారం ప్రాంతానికి చెందిన పెంటయ్యకు రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సాయం మంజూరైనట్లు తెలిపారు.

ఉమామహేశ్వర ఆలయంలో పూజలు


లింగాకారంలో దీపాలు వెలిగించిన భక్తులు

సుభాష్‌నగర్: కార్తీక మాసం సందర్భంగా సూరారం ఉమామహేశ్వర ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి వివిధ నమూనాలో దీపాలు వెలిగించారు.

13న అభ్యర్థనలు ఇవ్వండి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాకు సంబంధించి అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను స్వీకరించేందుకు కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి డేడికేటెడ్ కమిషన్ బృందం ఈ నెల 13న వస్తోందని, ఆసక్తి గల వారు కలవచ్చని బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఇందిర మంగళవార ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, బీసీ సంఘాలు, ప్రజలు అందజేసే వినతి పత్రాలను కమిషన్ బృందం స్వీకరిస్తుందన్నారు. ఈనెల 13న ఉదయం 10.30 గంటల నుంచి అభ్యర్థలను తీసుకుంటారని పేర్కొన్నారు. కమిషన్ బృందంలో చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు, సెక్రెటరీ సైదులు తదితరులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు.

పథకాలపై అవగాహన

మేడ్చల్: పట్టణంలోని సెయింట్ ఆన్స్ మనోవికాస్ కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయులు మానసిక వికలాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో అవగాహన సదస్సు నిర్వహించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎమ్మార్ సికింద్రాబాద్ బృందం వారు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, మానసిక వికలాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిజాంపేట్: ఆదర్శ మహిళా సంక్షేమ సంఘం, శ్రీ బాలాజీ దంత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిజాంపేట్ శ్రీరామ్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి అనూహ్య వచ్చింది. ఈ సందర్భంగా ఆదర్శ మహిళా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు చలసాని భారతి మాట్లాడుతూ విద్యార్థులు రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని, దంత సమస్యలు ఉంటే వెంటనే వైద్యులు సంప్రదించాలని సూచించారు. తమ సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీలత, ఉపాధ్యక్షురాలు పద్మకాంతి, సభ్యులు నాగలక్ష్మి, ఫణి, సుజాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులపై దాడి హేయమైన చర్య


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

సుభాష్‌నగర్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మా పరిశ్రమ ఏర్పాటు స్థల సేకరణ విషయమై గ్రామసభకు వచ్చిన కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు అధికారులపై దాడి చేయడం హేయమైన చర్య అని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్‌ఖాన్ అన్నారు. దాడిని ఖండిస్తూ కుత్బుల్లాపూర్ తహసీల్ కార్యాలయ సిబ్బంది మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌పైనే దాడి చేయడం దురదృష్టకరమన్నారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనలో డీటీ మల్లికార్జున రావు, ఆర్‌ఐ గులాం కలీం, విజయ్ కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్వినియోగం చేసిన టీచర్లపై చర్యలు తీసుకోవాలి



సాక్షి,సిటీబ్యూరో: జూన్‌లో జరిగిన టీచర్ల బదిలీ కౌన్సిలింగ్‌లో స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయులపై చర్య తీసుకోకుండా తాత్సారం చేయడంపై ఈ నెల 21న కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేయనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యాయ సంఘాల జేఏసీ హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ ఏడీ లింగానందంకు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నోటీసులతో కూడిన వినతి పత్రం అందజేశారు. బదిలీ కౌన్సిలింగ్‌లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై సంబంధిత టీచర్లపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులతో సహా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత టీచర్లపై చర్యలు తీసుకోవటంలో జరుగుతున్న తాత్సారాన్ని నిరసిస్తూ.. ఈ నెల 21న ధర్నా చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఏడీకి వినతి అందజేసిన వారిలో ఉపాధ్యాయ సంఘాల జేఏసీ జిల్లా నాయకులు జయసింహారెడ్డి(టీఎస్‌యూటీఎఫ్), వెంకటేశ్వర్లు (ఎస్టీయూటీఎస్), రాజ్‌కుమార్ (టీపీయూఎస్), విఠల్(టీయూటీఎఫ్), బ్రహ్మాచారి(టీపీటీఎఫ్) ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల: మరమ్మతుల కారణంగా సూరారం కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శ్రీరాంనగర్, శ్రీకృష్ణానగర్, వైష్ణవీనగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

కైలాష్ హిల్స్ ఫీడర్ పరిధిలో..

సుభాష్‌నగర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గాజులరామారం ఏఈ చైతన్య భార్గవ్ తెలిపారు. 11కేవీ కైలాష్ హిల్స్ ఫీడర్ పరిధిలోని మహదేవపురం, బాలయ్య బస్తీ, షిర్డీ హిల్స్, కైలాష్ హిల్స్, ఐశ్వర్య ఎస్టేట్స్, ప్రాగా టూల్స్, నందిని హిల్స్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్: చింతల్ డివిజన్ పరిధి హెచ్‌ఎంటీ కాలనీలో ఉన్న హజ్రత్ జిందాషా మదార్, రహమతుల్లా ఆలే ఉర్స్ ఉత్సవాల పోస్టర్‌ను రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు, దర్గా కమిటీ ముఖ్య సలహాదారు కేఎం ప్రతాప్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. హజ్రత్ జిందాషా మదార్ దర్గా కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షుడు షేక్ బాబుమియా, సభ్యులు మహమ్మద్ గౌస్, మమ్మద్ అన్సర్, వాజిద్, జావెద్, సమీర్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులతో అధ్యక్షుడు యాహోషువా

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ క్రిస్టియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాస్టర్ పుచ్చకాయల యాహోషువా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బాచుపల్లి సాయినగర్‌లోని సీజీఎం చర్చిలో పాస్టర్ సిమోన్ అధ్యక్షతన 40 చర్చిల పాస్టర్లు మంగళవారం సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. సలహాదారులుగా జ్యోతిబాబు, డేవిడ్, ఉపాధ్యక్షుడిగా డానియేల్, ప్రధాన కార్యదర్శిగా మాధవచారి, సంయుక్త కార్యదర్శిగా దేవరాజు, కోశాధికారిగా రమేశ్ నెహెమియా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శ్రీనివాస్, విల్సన్‌పీటర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు యాహోషువా మాట్లాడుతూ క్రిస్టియన్ల కమ్యూనిటీ హాల్, శ్మశాన వాటికల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ జీవన్ ప్రకాష్, జగదేక కుమార్, జాషువా పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


అన్నదానం చేస్తున్న భిక్షపతి దంపతులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని శ్రీ కట్టమైసమ్మ ఆలయంలో కార్తీక మంగళవారం, ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉడ్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి భిక్షపతి దంపతులు ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్ రెడ్డి , శైలజ దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు ప్రారంభం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మేయర్ శాంతి అన్నారు. 21వ డివిజన్ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శాంతి మాట్లాడుతూ.. ప్రగతి పనులతో ముందడుగు వేస్తున్నామన్నారు. అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, సీనియర్ నాయకులు సదానంద్, బాలరాజు, యాదగిరియాదవ్, రాంచందర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

100 ఫీట్ల రోడ్డు పనులకు మోక్షం

- సర్వే ప్రారంభించిన హెచ్‌ఆర్‌డీసీఎల్
- సురక్ష ఆస్పత్రి టూ రాంరెడ్డినగర్ వరకు నిర్మాణం
- నేషనల్ హైవే 44 నుంచి నర్సాపూర్ రాష్ట్ర రహదారికి ఇక సాఫీగా పయనం


100 ఫీట్లుగా నిర్మించనున్న రోడ్డు

జీడిమెట్ల: నేషనల్ హైవే 44 నుంచి సుభాష్‌నగర్ రాంరెడ్డినగర్ వరకు 100 ఫీట్ల రోడ్డు పనులకు మోక్షం కలిగింది. ఇది పూర్తయితే హైవే 44 నుంచి నర్సాపూర్ రాష్ట్ర రహదారికి లింకు రోడ్డుగా మారనున్నది. సురక్ష ఆస్పత్రి నుంచి రాంరెడ్డి నగర్ వరకు 1.2 కిలోమీటర్ల మేర 100 ఫీట్ల రోడ్డును నిర్మించనున్నారు. దీనికోసం ఇప్పటికే హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌డీసీఎల్) వారు సర్వే మొదలుపెట్టారు. ఈ పనులు పూర్తయితే ధూలపల్లి, పైప్‌లైన్ రోడ్డులో ట్రాఫిక్ చిక్కులు కొంతమేర తగ్గుతాయని వాహనదారులు పేర్కొంటున్నారు.

రాకపోకలు సులభం..

ఈ 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం పూర్తయితే జీడిమెట్ల పారిశ్రామికవాడకు ధూలపల్లి నుంచి వచ్చే భారీ వాహనాలు సైతం నేరుగా కొత్త రోడ్డు మీదుగా రావచ్చు. ఏదిఏమైనా సుభాష్‌నగర్ మీదుగా ఫాక్స్‌సాగర్ కట్ట కింద నుంచి రోడ్డు కావాలన్నది ఇక్కడి స్థానికుల కల. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే స్థానికులతో పాటు సుభాష్‌నగర్‌లో ఉన్న గోదాముల యజమానులకు సైతం మేలు జరగనున్నది.


సర్వే చేస్తున్న హెచ్‌ఆర్‌డీసీఎల్ సిబ్బంది

పశువుల లెక్క తేలుతోంది

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదేళ్ల తర్వాత కొనసాగుతున్న పశుగణన
- 2018లో చేపట్టిన కేంద్ర ప్రభుత్వం
- ఫిబ్రవరి 25 కల్లా పూర్తయ్యేలా జిల్లా పశు సంవర్ధక శాఖ కసరత్తు
- పశుసంపద ద్వారా వచ్చే ఆర్థికాదాయం, నిధుల మంజూరు తదితర వాటిపై దృష్టి



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 21వ జాతీయ పశుగణన ప్రారంభమైంది. ఆగస్టులోనే మొదలు కావాల్సిన అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన చేయాల్సి ఉంటోంది. 2018లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పశుగణన జరిగింది. జిల్లాలో దీనికి సంబంధించి పశుగణకులు, (సూపర్‌వైజర్లు) పర్యవేక్షకులకు శిక్షణ పూర్తి చేశారు. ఈ పశుగణన పూర్తిగా డిజిటల్ విధానంలో చేస్తున్నారు. అందుకు తగిన విధంగా సమాచారం సేకరిస్తున్నారు. ఫిబ్రవరి 25 వరకు జిల్లాలో పశుగణన పూర్తయ్యేలా జిల్లా పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటోంది. జనాభా ఆధారంగా రెండు, మూడు లోకేషన్లను కలిపి ఓ సూపర్‌వైజర్ నియమించారు.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పశుగణన	
మండలాలు	15
లొకేషన్లు	279
ఎన్యుమరేటర్లు	79
సూపర్ వైజర్లు	16
నోడల్ అధికారి	01

డిజిటల్ విధానంలో..

జిల్లాలో ఇప్పటికే పశుగణకులు క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించారు. డిజిటల్ విధానంలో యాప్ ద్వారా గణన చేసేందుకు అవసరమైన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు.. ఈ నెల 5 నుంచి మేడ్చల్ జిల్లాలో పూర్తి స్థాయిలో డిజిటల్ విధానంలో పశుగణనను ఎన్యుమరేటర్లు చేపడుతున్నారు.

ప్రణాళిక అవసరాల కోసం..

భారతదేశం విభిన్న పశు సంపదకు నిలయం. పశు సంపద ద్వారా వచ్చే ఆర్థికాదాయం గణనీయమైన పాత్ర పోషిస్తోంది. అభివృద్ధి, సంక్షేమం కోసం పశుగణన చాలా కీలకమైనది. ఏయే జాతి పశువుల సంతతి ఎంత ఉంది?, ఏది తగ్గుతోంది?, ఏది పెరుగుతోంది? అనే విషయం పశుగణన ద్వారా కూడా తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం తగిన ప్రణాళిక తయారు చేసి పశు సంపద అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గడిచిన లెక్కల ప్రకారం వివిధ జాతుల పశువుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లాలో గోజాతి పశువులు 27,068 ఉండగా, గేదె జాతి పశువులు 59,895 ఉన్నాయి. గొర్రెలు1,49,401, మేకలు 40,020, పందులు 2,485, కోళ్ల సంఖ్య 39,72,037 ఉన్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అంచనా వేస్తోంది.

రైతులు సహకరించాలి

పశుగణకులు ఇంటికి వచ్చినప్పుడు రైతులు తమ పశువుల వివరాలను నమోదు చేయించుకోవాలి. జిల్లాలో ఏజాతి పశువులు ఎన్ని ఉన్నాయనే విషయం తెలుస్తోంది. దీనికి అనుగుణంగా పశుసంవర్ధకశాఖ మందుల సరఫరా చేయడం, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఉపయోగపడుతుంది. రైతులందరూ సహకరించాలి.

– డాక్టరు.సుధాకర్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి